TELTEL/2023/87917

# జనం వెలుగు

www.janamvelugu.com, janamvelugu2023@gmail.com

అనునిత్యం అక్షరసత్యం

విలేఖర్లు కావలెను

జనం వెలుగు న్యూస్ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలనుండి జిల్లా మరియు మండల విలేఖరులు కావలెను

ఆసక్తి కలవారు వెంటనే సంప్రదించండి

9603322119

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 03 | సంచిక : 11 | శుక్రవారం 28 - 03 - 2025 | ఎడిటర్ : సీతార్ల సురేష్ | పేజీలు : 8 | వెల : 6/-

# విద్యా ప్రమాణాలకు పెంచడానికి సమూల ప్రక్షాళన అవసరం

**యువతలో కొరవడుతున్న నైపుణ్యత సీఎం రేవంత్ రెడ్డి**



**జనంవెలుగు, హైదరాబాద్:–** విద్యా ప్రమాణాలను మెరుగుపరచడానికి ఆ రంగంలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ దీన్ని ఒక సామాజిక బాధ్యతగా గుర్తించినప్పుడే వ్యవస్థలో అవసరమైన ప్రక్షాళన చేయడం సాధ్యపడుతుందని చెప్పారు. విద్యా రంగంపై శాసనమండలిలో జరిగిన ప్రత్యేక చర్చకు ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు. 2021 నేషనల్ అచీవ్మెంట్ సర్వేలో పేర్కొన్న గణాంకాలను సభలో వివరించారు. సబ్జెక్టుల వారిగా తెలంగాణలో ఏ స్థానానికి పడిపోయిందీ తెలిపారు. ఏ సబ్జెక్టులోనూ కనీస ప్రాథమిక సామర్థ్యాన్ని ప్రదర్శించలేని వారి సంఖ్య పెరగడం, ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల సంఖ్య తగ్గడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు."విద్యా విధానం కొంత ఆందోళనకరంగా మారింది. ఎవరు అవునన్నా కాదన్నా ఇందులో వాస్తవం ఉంది. విద్యా రంగంలో పడిపోతున్న ప్రమాణాలను పెంచాలంటే కేవలం నిధుల కేటాయింపు ఒక్కటే సమస్యకు పరిష్కారం కాదు. అందరూ ఒక సామాజిక బాధ్యతగా భావించినప్పుడే సమస్యను పరిష్కరించగలుగుతాం. విద్యా వ్యవస్థలో అవసరమైన మార్పులు, ప్రక్షాళన చేయడానికి సూచనలు, సలహాలు ఇవ్వండి. అందరి సూచనలతో సమగ్రమైన ఒక పాలసీ డాక్యుమెంట్ను రూపొందించి చర్చిద్దాం. పడిపోతున్న ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికీ మేల్కొనకపోతే భవిష్యత్తు తరాలకు మనం ద్రోహం చేసిన వారిమవుతాం. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ ప్రక్షాళన చేయలేం. విద్యా రంగంలో ప్రమాణాలు పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం అధికారంలోకి రాగానే, డీఎస్సీ నిర్వహించి 10 వేల మంది టీచర్ ఉద్యోగాలను భర్తీ చేశాం. ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న టీచర్ల బదిలీలు, ప్రమోషన్లను పూర్తి చేశాం. అయితే, విద్యా ప్రమాణాలు పడిపోవడంలో కేవలం ప్రభుత్వానిదే కాకుండా సమాజంపైన కూడా బాధ్యత ఉంది. సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యం పెంచాల్సిన అవసరం ఉంది. రాజకీయ కోణంలో ఆలోచనలు చేసినన్ని రోజులు విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయలేమని అన్నారు. యువతలో నైపుణ్యం కొరవడి వెనుకబడిపోతున్నారు. నైపుణ్యతలను పెంచడానికి యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ (#YISU) ని ఏర్పాటు చేశాం. అలాగే, మూస పద్ధతిలో సాగుతున్న ఐటీఐలను సంస్కరిస్తూ కాలం చెల్లిన కోర్సులకు స్వస్తి పలుకుతూ వాటిని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా (#ATC) అప్గ్రేడ్ చేస్తున్నాం. వంద అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ ఏటీసీలను ఏర్పాటు చేస్తున్నాం. క్రీడాకారులను తయారు చేయడం, ఒలింపిక్స్ క్రీడలు లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, అకాడమీలను ప్రారంభించబోతున్నాం. దీనికి సంబంధించి త్వరలోనే విధివిధానాలను ప్రకటిస్తాం. కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం" అని వివరించారు.

## కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగింది

**తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ నేతలు ఎందుకు మాట్లాడడం లేదు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**



**జనంవెలుగు, హైదరాబాద్ మార్చి 27:–** కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై ఎందుకు మాట్లాడడం లేదని అధికారి పార్టీ నేతలను కెటిఆర్ ప్రశ్నించారు. కేంద్ర బడ్జెట్లో తెలంగాణకు జరిగిన అన్యాయంపై కాంగ్రెసోళ్లు మాట్లాడకపోవడం బాధేసిందన్నారు. ప్రతి పనిలో గత ప్రభుత్వమని తమని విమర్శిస్తున్నారని, కేంద్రానికి వ్యతిరేకంగా కాంగ్రెసోళ్లు ఎందుకు మాట్లాడతాలేరన్నారు. తెలంగాణ పథకాలను కేంద్రం అనుకరిస్తోందని, మనకు జరిగిన అన్యాయంపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మాట్లాడకపోవడం బాధేసిందని పేర్కొన్నారు.పార్లమెంటు ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాలేదని విమర్శించారని, మాకు వచ్చింది సున్నానే కానీ మరి కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు వచ్చింది గుండు సున్నా కాదా? అని చురకలంటించారు. కొట్లాడకపోతే కేంద్రం నిధులు కూడా ఇవ్వదని, పోరాడాల్సిందేనని, కేంద్రంతో గట్టిగా మాట్లాడేందుకు తాము కూడా మద్దతిస్తామని, సత్సంబంధాలు ఉండాలని సిఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, తాము కూడా కేంద్రంతో సఖ్యతతో ఉన్నామని, ఏమీ రాలేదన్నారు. తెలంగాణలో ప్రముఖ ఆలయాలకు కేంద్రం ఒక్క రూపాయైనా ఇచ్చిందా? సమ్మక్క సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని, కుంభమేళాకు కేంద్రం నిధులు ఇస్తుందని, సమ్మక సారలమ్మ జాతరకు ఎందుకు నిధులు ఇవ్వరని నిలదీశారు. మనం అడగకపోతే కేంద్రం నిధులు ఇవ్వదని, తెలంగాణకు మేలు జరగాలని, తెలంగాణ ప్రజలు బాగుండాలని, అధికారంలో ఏ పార్టీ ఉన్నా తెలంగాణ బాగుండాలన్నదే తమ సంకల్పమని కెటిఆర్ స్పష్టం చేశారు. పదవులు శాశ్వతం కాదని, అధికారం ఎవరికీ శాశ్వతం కాదన్నారు.

## చేపూర్ గ్రామానికి 73 లక్షల నిధుల మంజూరు



**జనంవెలుగు, ఆర్మూర్:** ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, ఆర్మూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నరెడ్డి చొరవతో చేపూర్ గ్రామానికి సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజీలు, స్కూల్ బిల్డింగ్ నిర్మాణం కోసం మొత్తం 73 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ నిధుల మంజూరు పత్రాలను పిప్రి గ్రామంలో జరిగిన "జై బాపు జై భీమ్ జై సంవిధాన్" కార్యక్రమంలో చేపూర్ గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు ప్రొసీడింగ్స్ కాపీని వినయ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించిన వినయ్ కుమార్ రెడ్డికి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్, ఆగాలాదివిటి శ్రీనివాస్, జన్నాపల్లి గంగాధర్, బద్దం రాజు, చిట్యాల పోశెట్టి, సారంగి శాంతి, గంగసాయన్న, హరిపూర్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రాంసన్, ఇతర కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ డిప్యూటీ రీజనల్ మేనేజర్‌గా మధుసూదన్



**జనంవెలుగు, నిజామాబాద్:–** నిజామాబాద్ ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా ఎస్. మధుసూదన్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఈ పదవిలో ఉన్న సరస్వతి, శంకర్ లు హైదరాబాద్‌కు బదిలీ అయిన సంగతి తెలిసిందే. వారి స్థానంలో మధుసూదన్ కొత్తగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మధుసూదన్ మాట్లాడుతూ, ఆర్టీసీ సేవలను మరింత మెరుగుపరచేందుకు కృషి చేస్తానని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ సంస్థ అభివృద్ధికి పాటుపడతానని స్పష్టం చేశారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది మధుసూదన్‌కు స్వాగతం పలికారు.

## పి ఎం శ్రీ గర్ల్స్ హైస్కూల్‌లో ఆరుగురు విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



**జనంవెలుగు, భీంగల్:–** భీంగల్ పి ఎం శ్రీ గర్ల్స్ హైస్కూల్‌లో ఆర్బిఎస్కె బృందం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించింది. పరీక్షలో దృష్టిలోపం ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన కళ్లద్దాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గురువారం రోజు ఆరుగురు విద్యార్థులకు కళ్లద్దాలను మండల ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు శ్రీ స్వామి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జాన్ విల్సన్, రఘువన్, రాజ్ కుమార్, వినోద్ కుమార్, రాములు, శివకుమార్, వాసుదేవ్, వినోద్, సాగర్, రాజేందర్, ఈశ్వర్, భూమేశ్వర్, ఇమాన్యుల్, ఫిజికల్ డైరెక్టర్ రమణ పాల్గొన్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆర్బిఎస్కె బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## నిలిచిన రోడ్డు పనులు చేసేదెన్నడు



**జనంవెలుగు, నందిపేట్:–** నందిపేట్ మండల కేంద్రంలో నాలుగు నెలల క్రితం నంది విగ్రహం నుంచి జమా మసీదు వరకు రోడ్డు వెడల్పు పనులు ప్రారంభించిన అధికారులు మార్గమధ్యంలోనే పనులను వదిలేశారు. దీంతో తవ్విన రోడ్డు యథాతథంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామస్థులు సంబంధిత అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేసినప్పటికీ రోడ్డు పనులు పూర్తికావడం లేదు. తవ్విన రోడ్డు యథాతథంగా ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రజలు రోడ్డు మరమ్మతులు చేసి, అనుకోని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రోడ్డుపై దుమ్ము, ధూళి కారణంగా ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, తక్షణమే అధికారులు స్పందించి రోడ్డు పనులను పూర్తిచేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. మరింత ఆలస్యమైతే ప్రజల ప్రాణాలకు ప్రభుత్వ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## అక్రమంగా తరలిపోతున్న రేషన్ బియ్యాన్ని అడ్డుకోండి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి.



**జనం వెలుగు, ఆర్మూర్:–** రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం సరాఫరా చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు వ్యాపారులు అక్రమంగా తరలించుకు పోతుంటే అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై లేదా అని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రశ్నించాడు. రాష్ట్ర అసెంబ్లీ గురువారం ఎంఎల్ఏ పైడి రాకేష్ రెడ్డి మాట్లాడాడు. పేద ప్రజల కోసం సరా ఫరా అవుతున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా చూసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆయన అన్నాడు. నిజామాబాద్ నుండి మహారాష్ట్రకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిపోతున్నాయని, అసలు పేదవాడికి అందకుండా అక్రమ (దారులకు) వ్యాపారులకు ఎక్కువగా ఉపయోగపడుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశాడు. ఉగాది పర్వదినం సందర్భంగా సన్న బియ్యాన్ని ప్రభుత్వం సరాఫరా చేయనుందని ఆయన అన్నాడు. గతంలో నిజామాబాద్ ఎంఎల్ఏ రేషన్ బియ్యాన్ని అమ్ముకున్నాడని ఒక ఎంఎల్ఏగా ఎంపికైన వ్యక్తి రేషన్ బియ్యాన్ని అమ్ముకోవడం సిగ్గు చేటని ఆయన అన్నాడు. అక్రమంగా తరలిపోతున్న బియ్యాన్నికి అడ్డుకట్ట వేసి, అర్హులైన వారికి మాత్రమే రేషన్ కార్డులను ఇవ్వాలని అనర్హులకు తక్షణమే రేషన్ కార్డులను తొలగించి వేయాలని ఆయన డిమాండ్ చేశాడు.

## శ్రీరాంసాగర్ ప్యాకేజీ 21ఏ, పూర్తి చేసి సాగు నీరందించండి

**మాజి మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి**



**జనం వెలుగు, ఆర్మూర్:–** బాల్కొండ, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, మెటుపల్లి నియోజకవర్గాలలో సుమారు 2లక్షల 12 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు నిర్దేశించిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్యాకేజీ 20, 21, 21ఏ పనులను పూర్తి చేసి ఆయకట్టు రైతాంగానికి సాగునీటిని అందించాలని మాజి మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపాడు. శాసన సభ సమావేశాలలో గురువారం జీరో అవర్ లో ఇరిగేషన్ శాఖకు సంబంధించిన పలు సమస్యలను సభలో లేవనెత్తి ప్రభు త్వం దృష్టికి ఆయన తీసుకు రావ డం జరిగింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం 4800 కోట్లతో పనులను మొదలు పెట్టి 3300 కోట్ల రూపాయలను ఖర్చు చేసి సుమారు 70 శాతం పనులను పూర్తి చేయడం జరిగిందని ఆయన తెలిపాడు. ప్యాకేజి 21 ఏ మిగితా 20 శాతం మిగిలిన పనులను పూర్తి చేసినట్లైతే మరో 6 మాసాలలో ఒక లక్షా 20 వేల ఎకరాలకు సాగునీరు అందించ వచ్చని, ఈ పనిని పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరాడు. 150 కోట్లతో గత ప్రభుత్వ హయాంలో 9274 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చేపట్టడడం జరిగిందని, ఇందులో బాల్కొండ నియోజకవర్గంలోని చిట్టాపూర్, శ్రీరాంపూర్, బాల్కొండ తథితర గ్రామాలకు సుమారు 60 కోట్ల వ్యయంతో 3474 ఎకరాలు సాగులోకి వస్తాయని ఆయన అన్నాడు. సుమారు 90 కోట్ల రూపాయల వ్యయంతో ఆర్మూర్ నియోజకవర్గంలోని ఫతేపూర్, సుర్బిర్యాల్ గ్రామాలలో 5800 ఎకరాలకు ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందించ వచ్చని ఆయన అన్నాడు.

## అవయవదానం అనేది గొప్ప మానవీయ చర్య

**సభ్యులు ముందుకు వస్తేనే అసెంబ్లీలోనే సంతకాలు చేద్దాం అవయవదానంపై తొలి సంతకం తానే చేస్తానని స్పష్టం చేసిన కెటిఆర్**



**జనం వెలుగు, హైదరాబాద్ మార్చి 27:–** ప్రజలకు అవయవదానంపై అవగాహన కల్పించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా అవయవదానానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ముందుకు వచ్చారు. అవయవదానం బిల్లుపై చర్చ సందర్భంగా తాను అవయవదానానికి సిద్దంగా ఉన్నట్ల కెటిఆర్ ప్రకటన చేశారు. మన ప్రజాప్రతినిధులమని, అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. నియోజకవర్గాల్లోనూ అవయవదానంపై చైతన్యం తీసుకరావాలని సూచించారు. సభ్యులు ముందుకు వస్తేనే అసెంబ్లీలోనే సంతకాలు చేద్దామని, అవయవదానంపై తొలి సంతకం తానే చేస్తానని కెటిఆర్ స్పష్టం చేశారు. అవయవదానం అనేది గొప్ప మానవీయ చర్య అని, అవయవదానం మరింత మందికి జీవితాన్ని ఇస్తుందన్నారు.